క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నూజివీడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పని సరిగా చదివించాలని ఐసీడీఎస్ ఏలూరు పీడీ కె.పద్మావతి అన్నారు. తుక్కులూరులోని గ్రామ సచివాలయం వద్ద మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. నేడు ఆడపిల్లలు అన్ని రంగాల్లో మగవారికి దీటుగా రాణిస్తున్నారని, తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని చెప్పారు. ప్రభుత్వాలు మహిళల రక్షణకు అనేక చట్టాలను తీసుకొచ్చి అమలు చేస్తున్నాయని, వాటి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎస్వై నూరాని, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.3 లక్షలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను అధికారులు గురువారం లెక్కించారు. గడచిన 85 రోజులకు గాను కానుకల ద్వారా స్వామి వారికి రూ. 3,01,569 లభించాయని ఆలయ మేనేజర్ జె. వెంకటేశ్వరరావు తెలిపారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షించారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం
ఎంపీడీఓ రామకృష్ణ నాయక్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ అన్నారు. కేతనకొండలో సర్పంచి నళినీ ఆశాలత అధ్యక్షతన జరిగిన నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్స్ కొరకు నిర్దేశించిన లక్ష్యాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళ, పురుషుల్లో బీపీ, మధుమేహం లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయన్నారు. వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. గర్భిణులు మూడు మాసాల లోపు నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. గర్భిణుల విషయంలో నూరు శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్, సీహెచ్ఓ నారాయణ, ఎంపీటీసీ సువర్ణరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మానసిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో స్వాంతన ప్రాజెక్ట్‌లో భాగంగా మానసిక ఆరోగ్యంపై ఆరోగ్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి గల కారణాలు, ఎదుర్కొనే అంశాలు, ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్న వైద్యం తదితర అంశాలను వివరించారు. వయస్సుతో సంబంధం లేకుండా మానసిక అనారోగ్యం ఎవరికైనా రావచ్చన్నారు. అటువంటి వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్వాంతన ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కేశవ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు అందని జనరల్ ఫండ్స్

చాట్రాయి: గ్రామ పంచాయతీలకు జనరల్ ఫండ్స్ అందలేదు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో భూముల క్రయ, విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో 12 శాతం ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేస్తారు. జనరల్ ఫండ్స్ గ్రామ పంచాయతీలకు జమ చేయకపోవడంతో పారిశుద్ధ్య పనులకు, వీధి లైట్లు, తాగునీటి సరఫరాకు నిధుల్లేక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జనరల్ ఫండ్స్‌ను విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ఆగిరిపల్లి: మల్లిబోయినపల్లిలో ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రత్నబాబు, చెన్నారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

- నూజివీడు: మీర్జాపురంలో గొల్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి షేక్ నజ్మా శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ గూండ్రు శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.ధనమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

రేపు కిడ్నీ బాధితులతో ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తిరువూరు ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు కోరారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో గురువారం జరిగిన విలేకరులతో మాట్లాడారు. ఎ. కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైల వరం తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో కిడ్నీ బాధితుల పక్షాన ఈనెల 24వ తేదీన ఎ. కొండూరులో ధర్నా నిర్వహిస్తామని చెప్పారు.

కలుపు నివారణ మేలు



గంపలగూడెంలో కలుపు తీయాల్సిన వరి పైరు



పత్తి పైరులో పెరిగిన కలుపు

- వరి, పత్తి పైర్లలో కనిపిస్తున్న కలుపు, తుంగ
- దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం
- నివారణ చర్యలు చేపట్టాలని అధికారుల సూచన

గంపలగూడెం: ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు కురిశాయి. ఎంతో ఆశతో రైతులు సాగు పనులు చేపట్టారు. తిరువూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ప్రధానంగా వరి, పత్తి, మిరప పైర్లను సాగు చేశారు. డివిజన్ పరిధిలోని తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు మండలాల్లో ఈ ఏడాది వరి 13,603 హెక్టార్లలో, పత్తి 7,345 హెక్టార్లలో సాగు చేశారు. వరి సాగు ప్రారంభించి ఇప్పటికే ఆయా గ్రామాల్లో 20 నుంచి 35 రోజులు కాగా, పత్తి పైరు 40 నుంచి 50 రోజుల వయస్సులో ఉంది. పలు ప్రాంతాల్లో కలుపు, తుంగ కనిపిస్తోంది. కలుపు తొలగించకపోతే భూసారం మొత్తం కలుపు మొక్కలు తీసుకొని పైరుకు అందకుండా చేస్తాయి. ఫలితంగా పైరు ఎదుగుదల లోపించి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. కలుపు, తుంగ నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ తెలిపారు. రైతులకు పలు సూచనలు చేశారు.



పత్తిలో పైపాటు చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సాయిశ్రీ

నివారణ చర్యలు..

ఈ ఏడాది వరిసాగు ఎక్కువగా వెదజల్లే పద్ధతిన చేపట్టారన్నారు. ఈ పద్ధతిలో సాగుచేసిన చేలలో మొక్క వచ్చిన మూడు లేక నాలుగు రోజుల్లో ప్రిటివాక్లోర్ 400 ఎంఎల్‌ను 20 కిలోల ఇసుకలో కలిపి ఎకరం పొలంలో చల్లాలి. అనంతరం కొద్దిగా నీరు పెట్టి కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. నారు మడి పద్ధతిని సాగు చేసిన రైతులు ప్రిటివాక్లోర్ 400 ఎంఎల్, పైరజోసల్ఫ్యూరాన్ 100 గ్రాములు 20 కిలోల ఇసుకలో కలిపి ఒక ఎకరం పొలంలో చల్లుకొని నీరు పెట్టాలి. కలుపు ఎక్కువగా ఉన్న పొలాల్లో కూలీలతో తొలగించాల్సి ఉంటుంది.

ఊద, తుంగ నివారణ చర్యలు..

వరిలో ఊద, తుంగ నివారణకు నారు నాటిన 20 రోజుల తర్వాత, లేదా వెదజల్లిన చేలలో విత్తనాలు చల్లిన 20 రోజుల తర్వాత బిస్‌పైరిబాక్ సోడియం 80 ఎంఎల్ లేదా ఆల్‌మిక్స్ 8 గ్రాములు 20 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేయాలి.

పత్తిలో కలుపు నివారణ చర్యలు

పత్తి విత్తనాలు నాటిన 35 నుంచి 40 రోజుల్లో పైరిథయోబాక్ సోడియం 250 ఎంఎల్ లేదా క్విజలోఫాప్ ఇథైల్ 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేయాలి. ఇలా చేయడం ద్వారా ఊద, తుంగ, కలుపును సమర్థవంతగా నివారించుకోవచ్చు.

దేశంలో మహిళలకు భద్రత కరవు



నిరసన ప్రదర్శన చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, యూనియన్ నాయకులు

నూజివీడు: దేశంలో మహిళలకు భద్రత కరవైందని ఐద్వా ఏలూరు జిల్లా కమిటీ సభ్యురాలు, న్యాయవాది నండూరి పద్మాంజలి అన్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు నిరసనగా పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం భోజన విరామ సమయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నూజివీడు శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మాదక ద్రవ్యాలను కట్టడి చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ కార్యాలయ ప్రత్యేక అధికారి, స్త్రీవాద రచయిత్రి నూతక్కి ఉమామహేశ్వరి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణానంద్, నండూరి రామహనుమానులు, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకుడు టి.ప్రభాకరరావు, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా రెండు నెలలుగా కురిసిన మోస్తరు వర్షాలతో ఎక్కువ చెరువులు ఇంకా నిండలేదని, ఈ పరిస్థితుల్లో ఎన్నెస్పీ జలాలతో చెరువులను నింపాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూజివీడులో గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రస్తుతం సాగర్ జలాలు రెండో జోన్ వరకు వస్తున్నాయని, మూడో జోన్‌కు కూడా 15 రోజులు సాగర్ జలాలను సరఫరా చేస్తే నియోజకవర్గంలోని రైతులు చెరువులను నింపుకుంటారని చెప్పారు. మూడో జోన్ పరిధిలోకి వచ్చే నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు బ్రాంచి కాలువ, నూజివీడు మేజర్, మాచవరం మేజర్, బావులపాడు మేజర్, వేంపాడు మేజర్, నూజివీడు మైనర్ కాలువలున్నాయన్నారు. వాటి పరిధిలో 119 చెరువులున్నాయని, దాదాపు లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని చెప్పారు. ఈ ఆయకట్టులో రైతులు వరి పంటతో పాటు పత్తి, ఆరుతడి పంటలు సాగు చేశారని, చెరువులను నింపుకున్నట్లయితే నవంబర్ వరకు పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. వ్యవసాయ రంగంపైనే నియోజకవర్గంలోని రైతులు, రైతు కూలీలు ఆధారపడి జీవిస్తున్నందున సాగు నీరు ఎంతో అవసరమని వివరించారు.

నేడు మంత్రి రాక

ముసునూరు: మండలంలో జరుగనున్న ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి పాల్గొంటారని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రమణక్కపేటలో నిర్వహించనున్న గ్రామ సభకు శుక్రవారం ఉదయం మంత్రి హాజరవుతారని చెప్పారు.

అనాథల అభ్యున్నతే మిషన్ వాత్సల్య లక్ష్యం

ఐసీడీఎస్ ఏలూరు పీడీ కె.పద్మావతి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఏలూరు పీడీ పద్మావతి

నూజివీడు: 18 ఏళ్ల లోపు అనాథ పిల్లల ఆర్థిక, విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం ద్వారా నెలకు రూ.4 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తోందని ఐసీడీఎస్ ఏలూరు జిల్లా పీడీ కె.పద్మావతి అన్నారు. నూజివీడు సీడీపీఓ కార్యాలయ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకం లబ్ధిదారులు, వారి సంరక్షకులతో గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి పీడీ మాట్లాడుతూ లబ్ధిదారులు 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు తప్పనిసరిగా చదువుకోవాలని, ఒక కుటుంబంలో ఇద్దరి వరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. నూజివీడు సీడీపీఓ పరిధిలో 42 మంది లబ్ధిదారులున్నారన్నారు. ఈ పథకంలో లబ్ధిపొందుతున్న పిల్లలు భవిష్యత్‌లో ఎక్కడైనా హాస్టల్‌లో చేరితే పథకం లబ్ధిని నిలిపివేస్తారన్నారు. 30 రోజులకు మించి పాఠశాలకు గైర్హాజరైనా నిలుపుదల చేస్తామన్నారు. ఆర్డీఓ వై.భవానీ శంకరి మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లల సంరక్షకులు బాగా చదివించి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. సీడీపీఓ ఎస్వై నూరాని, ఏసీడీపీఓ బీవీవీ నాగేశ్వరి, నోడల్ ఆఫీసర్ కేఎస్ రాజశేఖర్, కౌన్సిలర్ యు.బాలస్వామి, అవుట్ రీచ్ వర్కర్ సీహెచ్ మాధవి పాల్గొన్నారు.

ముంచేసిన తూడు

- కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ
- నీరు పారక పంట పొలాలు మునక
- వారం రోజులుగా ముంపులోనే 50 ఎకరాల వరి పొలాలు



కవులూరు గ్రామ శివారులోని తారకరామ ఎడమ కాలువలో అల్లుకుపోయిన తూటికాడ



కవులూరు గ్రామ శివారులో తారకరామ ఎడమ కాలువను ఆనుకుని ముంపునకు గురైన వరి పైరు

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధి కవులూరు గ్రామ శివారులోని తారకరామ ఎత్తిపోతల పథకం ఎడమ కాలువ మొత్తం తూటికాడతో అల్లుకుపోయింది. కాలువలో ప్రవహించాల్సిన నీరు కాలువను ఆనుకొని ఉన్న వరిపైరుపై ప్రవహిస్తోంది. దీనితో ఇటీవల నాట్లు వేసిన 50 ఎకరాలకు పైగా వరిపైరు పూర్తిగా మునిగిపోయి గత వారం రోజులుగా నీటిలోనే నానుతోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నాట్లు వేసిన వరి పైరు ముంపు బారిన పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనంతటికీ కారణం కాలువలో తూటికాడతో పాటు కాలువను పూడిక తీయించకపోవడమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గిస్తే కాలువ చివరి భూములకు నీరందదు. అలాగని ప్రవాహం పెంచితే తూటికాడ, పూడిక ప్రభావంతో నీటి ప్రవాహం ముందుకు సాగక కాలువ పొంగి వరి పైరు ముంపు బారిన పడుతుంది.

ఇదంతా అధికారుల నిర్లక్ష్యమేనని ఖరీఫ్ ప్రారంభంలోనే కాలువకు నీటిని విడుదల చేయకముందే పూడిక తీయడంతో పాటు తూటికాడ తొలగించి ఉంటే తమకు ఈ తిప్పలు తప్పేవని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- నది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తరలింపు
- ట్రాక్టర్ ఇసుక రూ. 3,500 నుంచి రూ. 5 వేల వరకు విక్రయం
- టీడీపీ నేతల అండతోనే ఇదంతా
- పట్టించుకోని అధికారులు



మూలపాడు ఇసుక రేవులో అక్రమంగా ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

ఇబ్రహీంపట్నం: మండలంలోని నదీ పరీవాహక ప్రాంత గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇబ్రహీంపట్నం మండలంలో ప్రభుత్వం ఇసుక ర్యాంపు కేటాయించకపోవడంతో గ్రామాల్లోని నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక మేటలను అధికార పార్టీ నాయకులు అక్రమ మార్గాన తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో 4, 5 కిలోమీటర్ల దూరం కలిగిన మూలపాడు, కొటికలపూడి, జూపూడి వంటి గ్రామాల నుంచి అక్రమ మార్గాన ఇసుక తరలించి రూ.3,500 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కొంతమంది ఇక్కడ ఇసుకను కూడా రూ.5 వేలకు విక్రయిస్తున్నారు.

అధికార పార్టీ నేత దందా..

అధికార పార్టీ తరపున గ్రామాల్లో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న కొందరు నాయకులు ఇసుక తరలింపు వ్యవహారంలో చీకటి సామ్రాజ్యాధిపతుల అవతారం ఎత్తుతున్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అక్రమ ఇసుక తరలింపులో కఠినంగా వ్యవహరిస్తామని ఓవైపు చెబుతున్నప్పటికీ ఆయన వెనుక పెద్ద మనుషులుగా తిరుగుతున్న వారు ఎమ్మెల్యే మాటలు పెడచెవిన పెట్టడం గమనార్హం. ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో అధికార పార్టీ పెద్దలే ఉండటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తే రానున్న రోజుల్లో ఇసుక రేవుల్లో జేసీబీల ద్వారా లోడింగ్ చేయించి డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పొరుగు రాష్ట్రాలకు మన ఇసుక తరలిపోయే అవకాశం ఉంటుందని పలు ప్రజాసంఘాల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలోని ఇసుక అక్రమ రవాణాను తక్షణం నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

నియంత్రణ చర్యలు చేపడతాం..

ఈ విషయంపై తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. మూలపాడులో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు.

హై స్కిల్డ్ కార్మికులుగా గుర్తించాలని వినతి

ఇబ్రహీంపట్నం:ఎన్టీటీపీఎస్‌లో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సెమీ స్కిల్డ్ కార్మికులను హై స్కిల్డ్ కార్మికులుగా గుర్తించాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజును ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల క్యాటగిరేషన్‌లో సెమీ స్కిల్డ్ కార్మికులు మెయింటెనెన్స్ విభాగంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని యూనియన్ రాష్ట్ర నాయకులు మోదుగ మోహనరావు సీఈకి వివరించారు. ఈ విభాగంలో ఎందరో కార్మికులు టెక్నికల్ కోర్సులు ఐటీఐ, డిప్లమో డిగ్రీలు కలిగి ఉన్నందున హై స్కిల్డ్‌గా మార్పు చేయాలని, వివిధ కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కార్మికులను ఐదో దశ 800 మెగావాట్ల ప్లాంటులో రెగ్యులర్ మెయింటెనెన్స్‌కు అవకాశం కల్పించాలని కోరారు. యూనియన్ల నాయకులు రవికుమార్, రమేష్, సుధాకర్, సాల్మన్ రాజు, శంషేర్‌వలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మైలవరం ఎస్ఐగా సుధాకర్

మైలవరం: మైలవరం ఎస్ఐగా కె.సుధాకర్‌ను నియమించినట్లు పోలీస్ కమిషనర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటి వరకు మైలవరం ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన ఎస్ఐ హరిప్రసాద్‌ను ప్రస్తుతం వీఆర్‌లో ఉంచినట్లు కార్యాలయం తెలిపింది.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ముసునూరు: రక్త హీనత బారిన పడకుండా విద్యార్థులను కాపాడుకునేందుకు కృషి చేయాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో గురువారం సమన్వయ సమావేశం మానవ వనరుల కేంద్రంలో నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ షకీనా ఇవాంజిలిన్, డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ రక్తహీనత గల విద్యార్థులను గుర్తించి వారికి మందులు, పౌష్టికాహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. వైద్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సైన్స్ పరిశోధనలపై ప్రచారం

తిరువూరు: సైన్స్ పరిశోధనలపై జన విజ్ఞాన వేదిక విస్తృతంగా ప్రచారం చేస్తోందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక మండల వార్షిక సమావేశం గురువారం తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలకు ప్రభుత్వాలు తగినంత ప్రోత్సాహం ఇవ్వకపోవడం వల్లే ఫలితాలు సామాన్యులకు చేరువకావడం లేదన్నారు. జేవీవీ లాంటి మరికొన్ని సంస్థలు బలోపేతం అయితేనే సైన్స్ ఫలాలు సామాన్యునికి చేరువ అవుతాయని చెప్పారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. హరికృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' గ్రామ సభలు

విజయవాడరూరల్: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టనున్న పనులను గుర్తించేందుకు గురువారం ఉదయం మండలంలోని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామసభలు ప్రారంభమవుతాయని చెప్పారు. గొల్లపూడి, జక్కంపూడి, పైడూరుపాడు, రాయనపాడు, రామరాజ్య నగర్, కొత్తూరు తాడేపల్లి, వైఎస్సార్ గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు.

- చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం గ్రామ సభలు శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ దుర్గా ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సభల నిర్వహణాధికారులను వివరించారు. గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

రెండు స్కూల్ వ్యాన్లకు జరిమానా

ముసునూరు: అనుమతులు, రికార్డులు లేకుండా నడుపుతున్న రెండు స్కూల్ వ్యాన్లకు జరిమానాలు విధించామని నూజివీడు రవాణా శాఖాధికారి జి.నాగమురళి తెలిపారు. ముసునూరులోని పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం ఆయన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు స్కూల్ వ్యాన్లకు రూ.15,000 జరిమానాలు విధించారు. అనుమతులు సరిగా లేని, కాలం చెల్లిన వ్యాన్లను విద్యార్థుల రవాణాకు వినియోగిస్తే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

చాట్రాయి: చిత్తపూరు గ్రామానికి చెందిన డీవీఎస్ రామ్‌కుమార్ స్థానిక పాఠశాలకు బ్లూ టూత్ సౌండ్ సిస్టమ్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఇలాసారపు రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరులో పెరిగిన చిల్లర దొంగతనాలు

తిరువూరు: తిరువూరు పట్టణంలో చిల్లర దొంగతనాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. నివాస గృహాల్లో రాత్రి వేళ చిల్లర దొంగలు చేతికందిన వస్తువులను అపహరిస్తున్నారు. దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు అపహరించడం, ద్విచక్ర వాహనాల చోరీలు సైతం జరుగుతుండటంతో పలువురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. 12వ వార్డు పీటీ కొత్తూరులో ఇటీవల చిన్నహోటల్‌లో దొంగలు పడి గ్యాస్ సిలిండర్, రూ.1,500 నగదు అపహరించారు.16వ వార్డు కుమ్మరి బజారులో వినాయక గుడిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రెండు గ్యాస్ బండలు, కరెంట్ ఇన్వెర్టర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్వామి వివేకానంద సేవలు ఎనలేనివి

మైలవరం: భారతీయ విశిష్టతను విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని విజ్ఞాన భారతి సంస్థ సమన్వయ కర్త ఈశ్వర్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత దర్శన్ కార్యక్రమాన్ని విజ్ఞాన భారతి సంస్థతో కలిసి చరిత్ర, రాజనీతి శాస్త్ర విభాగాలు సంయుక్తంగా 'భారతీయ సాంస్కృతిక వైభవం ప్రాచీన, మధ్య, ఆధునిక యుగం అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈశ్వర్ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక వైభవం, ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలలో వెలుగొందిన విధానాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు స్వామి వివేకానంద చేసిన కృషిని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ జాతీయ ఉద్యమాలలో పాల్గొన్న ఎంతోమంది జాతీయ నాయకుల సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చరిత్ర విభాగం అధ్యాపకులు ధరావతు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్యాల లాభాపేక్షే ప్రమాదాలకు కారణం

నూజివీడు: విశాఖపట్నం, అనకాపల్లిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ విమర్శించారు. అనకాపల్లి అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 50 మందికి పైగా గాయపడ్డారని, 18 మంది మృతిచెందారని, రియాక్టర్ పేలుడుతో భయాందోళనతో కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయారన్నారు. యాజమాన్యాల లాభాపేక్షే ఇలాంటి ప్రమాదాలకు కారణమన్నారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలని, మృతులకు ప్రభుత్వం కోటి రూపాయలు, యాజమాన్యం కోటి రూపాయలను పరిహారంగా అందించాలన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు, యాజమాన్యం నుంచి రూ.25 లక్షలు పరిహారంగా ఇవ్వాలని హరినాథ్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టాలని హరినాథ్ కోరారు.

శివపార్వతుల కల్యాణం

ఆగిరిపల్లి: ముక్తేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో మండపారాధన, పూర్ణాహుతి, ఆలయ సంప్రోక్షణ, శివపార్వతుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి, కుమారస్వామి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.